క్లుప్తంగా

'విజయోత్సవ ర్యాలీకి అనుమతి లేదు'

జన్నారం: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే జన్నారం మండలం కేంద్రంలో విజయోత్సవ ర్యాలీలు, టపాసులు పేల్చడాలు, డీజేలతో బైక్ ర్యాలీ చేయడం, ప్రజలు ఒక చోట గుమిగూడటం లాంటివి నిషేధించినట్లు ఎస్సై సతీశ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

పరామర్శ



మల్లేశ్‌ను పరామర్శిస్తున్న దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని 15వ వార్డు కౌన్సిలర్ శ్రీరాముల సుజాత, మల్లేశ్ కుటుంబ సభ్యులపై శుక్రవారం దాడి జరగ్గా, శనివారం మంచిర్యాల బీఆర్‌ఎస్ అభ్యర్థి నడిపెల్లి దివాకర్‌రావు పరామర్శించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు చేసిన దాడి వివరాలను అడిగి తెలుసుకుని, భయపడకుండా ఉండాలని, బీఆర్‌ఎస్ నాయకులకు తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

హెచ్‌ఎమ్మెస్ డివిజన్ కార్యదర్శిగా నవీన్‌కుమార్



మందమర్రిరూరల్: మందమర్రి డివిజన్ హెచ్‌ఎమ్మెస్ కార్యదర్శిగా శాంతిఖనిలో జనరల్ మజ్దూర్‌గా విధులు నిర్వర్తించే నవీన్‌కుమార్‌ను నియమిస్తూ హెచ్‌ఎమ్మెస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ శనివారం ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా నవీన్‌కుమార్ మాట్లాడుతూ.. తనకు పదవి ఇచ్చినందుకు రియాజ్ అహ్మద్‌తో పాటు నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. యూనియన్ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

పీఆర్‌టీయూ మండల కమిటీ ఏర్పాటు



భీమారం: పంచాయతీ రాజ్ ఉపాధ్యాయ సంఘం (తెలంగాణా) మండల కమిటీ అధ్యక్షుడిగా నర్సింగాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు గుడిమల్ల నరేందర్‌తో పాటు కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నట్లు రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు. మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో జరిగిన కార్యవర్గ సమావేశంలో కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. ప్రధానకార్యదర్శిగా ఆసంతుల రవీందర్ ఎన్నికయ్యారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి వేణుగోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టె శంకర్‌లతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రమాదాలు జరగకముందే పట్టించుకోండి



భీమిని: పత్తిలోడ్ ట్రాక్టర్లు రాత్రి వేళల్లో వెళ్తుండటంతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. భీమిని, కన్నెపల్లి మండలాల్లో సేకరించిన పత్తిని ఇంటికి తరలించేందుకు ట్రాక్టర్ ట్రాలీని డోర్లు తీసి వెడల్పుగా అమర్చి అందులో పత్తి బస్తాలు వేసి దాని పై కూలీలు కూర్చొని ప్రమాదకరంగా ప్రయాణం చేస్తున్నారు. రాత్రి వేళల్లో లోడ్‌తో వచ్చే క్రమంలో ఎదురుగా వచ్చే వాహనాలు గమనించక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. గతేడాది పోలంపల్లి శివారులో పత్తి లోడ్ ట్రాక్టర్‌కు ఆటో ఢీ కొనడంతో అందులో ప్రయాణిస్తున్న ముగ్గురు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. అలాంటి ప్రమాదాలు జరగకుండా అధికారులు దృష్టిసారించాలని పలువురు కోరుతున్నారు.

కల్లాలు లేక కర్షకుల కష్టాలు

- ధాన్యం ఆరబెట్టడానికి తప్పని తిప్పలు
- రహదారిపైనే కుప్పలు పోయాల్సిన దుస్థితి
- ఇబ్బందుల్లో వాహన దారులు



ధర్మారావుపేట సమీపంలో రోడ్డుపై ధాన్యం కుప్పలు

దండేపల్లి: ఖరీఫ్ వరికోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. దీంతో నూర్పిడి చేసిన వరిధాన్యాన్ని ఆరబెట్టడానికి రైతులు నానా అవస్థలు పడుతున్నారు. కల్లాలు లేక రోడ్డు పైనే ఆరబెట్టాల్సిన దుస్థితి నెలకొంటుంది. అధికారుల అలసత్వమో, లేక ప్రభుత్వాల నిర్లక్ష్యమో కానీ అన్నదాతలను ఆగం జేస్తోంది. కల్లాలు లేకపోవడంతో వరిధాన్యాన్ని రోడ్డుపై కుప్పలుగా పోస్తుండడంతో వాహనదారులూ ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. దండేపల్లి మండలం మేదరిపేట నుంచి గూడెం వెళ్లే రింగ్ రోడ్డు వెంట ఎక్కడ చూసినా రోడ్డుకు సగం వరకు ధాన్యం కుప్పలు పోసి ఉంచారు. మండలంలోని ధర్మరావుపేట, ద్వారక, కొండాపూర్, కాసిపేట, వెల్గనూర్ గ్రామాల సమీపంలో రైతులు రోడ్డునే కల్లాలుగా వినియోగించుకుంటున్నారు. రోడ్ల పైనే ధాన్యం ఆరబోయడం, కుప్పలు చేయడం, తూకం కూడా అక్కడే వేయాల్సిన పరిస్థితి ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో రోడ్డుగుండా వెళ్లే పలువురు వాహనదారులు కొంత ఇబ్బందులకు గురవుతున్నారని వాపోతున్నారు. ఇప్పటికైనా కల్లాల ఏర్పాటుపై ప్రభుత్వాలు, అధికారులు దృష్టి పెట్టాలని పలువురు రైతులు కోరుతున్నారు.



ద్వారక సమీపంలో రోడ్డు పై ధాన్యం కుప్పలు



కొండాపూర్ సమీపంలో రోడ్డుపై..

కల్లాలు ఏర్పాటు చేయండి

చెన్నూర్‌రూరల్: రైతులు పండించిన పంటను ఆరబోసుకునేందుకు కల్లాలు లేకపోవడంతో మండలంలోని ఆస్నాద, ఒత్కులపల్లి, చింతపల్లి, కిష్టంపేట తదితర గ్రామాల్లో రోడ్లపైనే ఆరబోస్తున్నారు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. సంబంధిత అధికారులు పట్టించుకొని కల్లాలు ఏర్పాటు చేయించాలని పలువురు కోరుతున్నారు.



నిధుల్లేక తడబడి

- నిలిచిపోయిన మనఊరు–మన బడి పనులు
- చేతులెత్తేసిన గుత్తేదారులు



జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిలిచిపోయిన డైనింగ్‌హాల్

మంచిర్యాలఅర్బన్: పాఠశాలల రూపురేఖలు మార్చేందుకు గత సంవత్సరం 2022–23 చేపట్టిన మనఊరు–మనబడి నిధుల్లేక తడబడుతున్నాయి. నెలలు గడుస్తున్నా బిల్లులు రాకపోవటంతో గుత్తేదారులు చేతులెత్తేశారు. మండలానికి రెండు చొప్పున వందశాతం 36 నమూన పాఠశాలలు పూర్తి చేసినా, మిగిలిన పాఠశాలల్లో పనులు ఆగుతూ.. సాగుతున్నాయి. తొలివిడతలో.. 245 పాఠశాలల్లో ఎంపిక చేసిన బడుల పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. గుత్తేదారులు ముందుకు రావటంతో ప్రజాప్రతినిధులు, అధికారులు జోక్యం చేసుకొని ఒప్పించి పనులు చేయించినప్పటికీ బిల్లులు రాకపోవటంతో బడి పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి.

చేసిన పనులు బిల్లుల రాక..

మనఊరు–మనబడిలో చేసిన పనులకు బిల్లుల రాక గుత్తేదారులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. పనులు ఎంతమేర చేస్తే అంత నిధులు చెల్లిస్తూ వస్తుంటారు. ఈ లెక్కన రూ.24 కోట్ల 26లక్షల 33వేల పనులు చేసినట్లు మేజర్‌మెంట్ బుక్ (ఎంబీ)నమోదు చేయగా రూ.18కోట్ల 53లక్షల 96వేలు మాత్రమే చెల్లించారు. అప్పులు చేసి పనులు చేపడితే నెలల తరబడి బిల్లులు చెల్లించకపోవటంతోనే పనులు చేయలేమని గుత్తేదారులు తెగేసి చెబుతున్నట్లు తెలుస్తోంది. బడ్జెట్ లేకపోవటం, ఓవైపు.. అధికారులంతా ఎన్నికల ప్రక్రియతో తలమునకలు కావటంతో మన ఊరు–మనబడి పనులు ఎప్పటికీ పూర్తయ్యేనో తెలియని పరిస్థితి.

పనులు ఇలా..

మనఊరు–మనబడిలో తొలివిడతలో 248పాఠశాలలు ఎంపిక చేయగా, 245బడుల్లో పనులకు కలెక్టర్ ఆమోదం తెలిపారు. మూడు పాఠశాలల్లో వివిధ కారణాల వల్ల పనులు చేపట్టలేదు. నీటి సౌకర్యం, టాయిలెట్లు, విద్యుదీకరణ, తాగునీటి సరఫరా, విద్యార్థులు, సిబ్బందికి సరిపడే ఫర్నిచర్, మరమ్మతులు చేయటం, కిచెన్‌షెడ్లు, శిథిలమైన గదుల సాధనంలో కొత్త గదులు నిర్మించాలి. ఇందులో 211పాఠశాలల్లో 30లక్షల లోపు ఉన్న పనులు చేయాల్సి ఉంది. 30లక్షల్లోపు దాటితే కాంట్రాక్టర్‌తో పనులు చేయించాల్సి ఉంటుంది.



80నుంచి 90వరకు బడులు పనులు వేగవంతంగా సాగాయి. చిన్నచిన్న పనులు పూర్తి చేయాల్సి ఉన్నా గుత్తేదారులకు బిల్లులు రాకపోవటంతో ముందుకు సాగక అసంపూర్తిగా మిగిలిపోయాయి.

ఘనంగా అయ్యప్ప పడిపూజా మహోత్సవం



పడిపూజలో అయ్యప్ప దీక్షాపరులు

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల హిందూ సేవక్ సమాజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం మున్సిపాలిటీ దుకాణ సముదాయం ఆవరణలో నిర్వహించిన సామూహిక అయ్యప్ప పడిపూజా మహోత్సవం అత్యంత వైభవోపేతంగా, కనుల పండువగా జరిగింది. గురుస్వామి శ్రీమాన్ చక్రవర్తుల పురుషోత్తమాచార్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక అయ్యప్ప పడిపూజా మహోత్సవం దేదీప్యమానంగా సాగింది. అయ్యప్ప ఉత్సవ విగ్రహానికి పంచామృతాలు, వివిధ రకాల పండ్లు, పూలతో ప్రత్యేకంగా అభిషేకం జరపగా అశేష భక్తజనులు, అయ్యప్పస్వాములు కనులారా అభిషేకాన్ని తిలకించారు. అనంతరం అయ్యప్పస్వామి విగ్రహాన్ని పట్టువస్త్రాలు, వివిధ రకాల పూలతో అందంగా అలంకరించారు. ఇక 18 మెట్ల పూజలో భాగంగా కళశాలతో వేద మంత్రాలతో పాటు తాంత్రిక పూజలు జరిపి పడి ముట్టించారు. మన్నవ విజయభాస్కర్ గురుస్వామి 18వ పడి కావడంతో స్వామికి మంత్రోపదేశం చేసి మంద్రదండం, కొబ్బరి చెట్టును అందజేసి శబరిమల అయ్యప్పస్వామి దర్శనం కనుల పండవగా జరగాలని పేటతుళ్లి ఆడుతూ ఆనందోత్సాహాల మధ్య ఘనంగా సత్కరించారు. హిందూ సేవక్ సమాజ్ వ్యవస్థాపకుడు బండవరం జగన్, సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప పడిపూజలో అయ్యప్ప భజన బృందం పాటలతో పడి పూజ పరిసరాలన్నీ అయ్యప్ప శరణుఘోషతో మారుమోగింది. పడి పూజ మహోత్సవానికి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నడిపెల్లి దివాకర్‌రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే అభ్యర్థి వెరబెల్లి రఘునాథ్, డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ తదితర పుర ప్రముఖులు హాజరయ్యారు.



పడిపూజ నిర్వహిస్తున్న గురుస్వామి

ఓటరు ఎటువైపో..!

- తీర్పు వెలువడేది నేడే
- అందరి దృష్టి ఓట్ల లెక్కింపుపైనే
- జోరుగా బెట్టింగులు

బెల్లంపల్లి: నియోజకవర్గంలో ఈ సారి 81.19శాతం పోలింగ్ నమోదు కాగా ఓటర్లు ఎటువైపు మొగ్గు చూపారనేది ఆసక్తికరంగా మారింది. ఆదివారం ఓట్ల లెక్కింపు జరగనుండటంతో ప్రస్తుతం అందరి దృష్టి అటువైపే మళ్లింది. బెల్లంపల్లి మున్సిపాలిటీలో సాధారణ స్థాయిలో పోలింగ్ జరగ్గా, కన్నెపల్లి, భీమిని, వేమనపల్లి, కాసిపేట, నెన్నెల, తాండూర్, బెల్లంపల్లి మండలాల్లో ఊహించని విధంగా పోలింగ్ నమోదైంది. గ్రామీణ ఓటర్లు అత్యధికమంది ఓటును వినియోగించుకోవడంతో ఆ ఓట్లు అధికార పార్టీ బీఆర్‌ఎస్‌కు మళ్లాయా లేదా ప్రధాన విపక్షమైన కాంగ్రెస్ ఖాతాలో పడ్డాయా అనేది అర్థం కాని పరిస్థితులు ఏర్పడ్డాయి. గ్రామీణ ప్రాంతాల ఓటర్లు ఏ పార్టీ వైపు మొగ్గు చూపుతారో ఆ పార్టీ అభ్యర్థికే విజయావకాశాలు మెండుగా ఉంటాయనే విశ్లేషణలు జరుగుతున్నాయి. ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్ జరిగిందా అనే చర్చ కూడా జరుగుతోంది. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ రెండు పక్షాల్లోనూ కోవర్టులు ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఆయా పార్టీలకు చెందిన నాయకులు సొంత పార్టీ అభ్యర్థికి ప్రచారం చేస్తూనే.. ప్రత్యర్థి పార్టీ అభ్యర్థికి అనుకూలంగా వ్యవహరించారనే ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో ఓ ప్రధాన రాజకీయ పార్టీలో గెలుపు ఉత్సాహం తొణికిసలాడుతుండగా, ప్రత్యర్థి పార్టీలో ఆ ఛాయలేవీ కానరాకుండా ఉన్నాయి.

అభ్యర్థుల గెలుపోటములపై బెట్టింగ్‌లు

పోలింగ్ జరిగిన సరళిని అంచనా వేసి కొందరు బెట్టింగ్‌లు కాస్తున్నట్లుగా తెలుస్తోంది. బీఆర్‌ఎస్ పార్టీ బెల్లంపల్లిలో ముచ్చటగా మూడోసారి విజయం సాధిస్తుందని కొందరు, కాదు కాంగ్రెస్ పార్టీనే విజయబావుటా ఎగుర వేసి సత్తా చాటుతుందని ఇంకొందరు బెట్టింగ్‌లో పాల్గొన్నట్లుగా ప్రచారం జరుగుతోంది. ఒక్కో అభ్యర్థిపై రూ.లక్షల్లో బెట్టింగ్ కాస్తుండటం చర్చనీయాంశంగా మారింది.

కార్మిక ఓటర్లే కీలకం..!

చెన్నూర్: అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల్లో కార్మిక క్షేత్రం ఎటు వైపు ఉందని నియోకవర్గంలో జోరుగా చర్చ సాగుతోంది. గత ఎన్నికల ఫలితాలను పరిశీలిస్తే నియోజకవర్గంలో కార్మిక ఓటర్లే ఎన్నికల ఫలితాలను తారుమారు చేసిన దాఖలాలు ఉన్నాయి. చెన్నూర్ నియోజకవర్గంలో 1,88,283ఓటర్లు ఉండగా మందమర్రి మండలంలోనే 77,210మంది ఓటర్లు ఉన్నారు. చెన్నూర్, కోటపల్లి, భీమారం, జైపూర్ నాలుగు మండలాల్లో 1,02,024ఓటర్లు ఉండగా ఎన్నికల్లో 1,50,754మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎక్కడ చూసిన చెన్నూర్‌లో గెలిచేదెవరని ఆయా పార్టీల అనుచరులు చర్చించుకోవడం కంటే యువత, వ్యాపారులు, చర్చించుకోవడం విశేషం.

ప్రతి ఎన్నికల్లో భిన్నమైన తీర్పు..

2018లో జరిగిన ఎన్నికల్లో నియోజకవర్గంలో చెన్నూర్, కోటపల్లి, భీమారం, జైపూర్ నాలుగు మండలాల ఓటర్లు ఇరుపార్టీలకు సానుకులంగా స్పందించారు. మందమర్రి మండలంలోని కార్మిక కుటుంబాలు నాలుగు మండలాలకు భిన్నంగా తీర్పు ఇచ్చారు. కార్మిక ఓటర్లు ఇచ్చిన తీర్పుతో గత ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి గెలుపొందారు. ఈ సారి జరిగిన పోలింగ్ తీరుపై ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎవరి ధీమాలో వారు ఉన్నారు. ప్రజలు మాత్రం కార్మిక ఓటర్లు ఎటువైపు ఉంటే ఆ పార్టీ అభ్యర్థే విజయకేతనం ఎగరవేస్తారని ప్రచారం సాగుతుంది.

చెక్ డ్యాం నిర్మించండి..!

- గోదావరిలో కలుస్తున్న జోడువాగుల నీళ్లు
- వృథా నీటిని ఆపితేనే పంటలు నస్యశ్యామలం



భీమారం సమీపం గుండా ప్రవహిస్తున్న గొల్లవాగు

భీమారం: మామూలుగా ఒకే వాగు వెళ్లే ప్రదేశాలు చూసే ఉంటాం కానీ, భీమారం వద్ద రెండు పెద్ద వాగులు ఒకటిగా మారి గోదావరిలో వృథా కలిసి పోతున్నయ్(ఒకటి గొల్లవాగు ప్రాజెక్ట్ వైపు నుంచి వచ్చే వాగు కాగా, మరొకటి పోలంపల్లి మీదుగా వచ్చే చింతవాగు). ఆ రెండు వాగులు కలిసే చోటును జోడు వాగులు అని పిలుస్తుండగా అక్కడ చెక్ డ్యాం ఏర్పాటు చేస్తే అన్నదాతలకు మేలు జరుగుతుందని పలువురు చర్చించుకుంటున్నారు. భీమారం మండలం మీదుగా వెళ్లే జోడు వాగుల్లో దాదాపు 10నెలలు నీటి ప్రవాహం ఉంటుందని, మండలంలోని బీడుభూములకు సాగు నీరు అందుతుందని అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. గొల్లవాగు ప్రాజెక్ట్ మత్తడిపై నుంచి వచ్చే నీళ్లు కూడా జోడువాగుల గుండా ప్రవహిస్తుండగా, భీమారం–చెన్నూరు మధ్య అటవీ శాఖ నర్సరీ వద్ద మరో వాగు కలవడంతో వాగు నీటి ఉధృతి మరింత పెరుగుతుంది. అయితే దాదాపు రెండు టీఎంసీ వరద నీళ్లు ప్రతీ సంవత్సరం వృథాగా పోతున్నాయి.

నీటిని సద్వినియోగం చేసుకుంటే..

రెండు వాగులు కలిసి ప్రవహించే జోడువాగుల నీటిని ఆపగలిగితే పోలంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని అంకూసాపూర్, ఎలకేశ్వరం గ్రామ శివారులోని భూములకు సాగునీరు అందించే అవకాశం ఉంది. ఎత్తిపోతల పథకం ద్వారా భారీ చెక్ డ్యాం నిర్మించి అక్కడి నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా బీడు భూములకు నీరు అందిస్తే రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. నీటి వనరులు లేక నానా ఇబ్బందులు పడే ప్రాంతాలను చూస్తాం కానీ, ఇక్కడ మాత్రం అన్ని వనరులు ఉండి ఉపయోగించుకోలేక అవి సముద్రం పాలవుతున్నాయి.

ప్రాజెక్ట్ ఉన్నా ప్రయోజనం శూన్యం..

భీమారం వద్ద గొల్లవాగు ప్రాజెక్ట్ ఉన్నా భీమారం దాని చుట్టు ఉండే అంకూసాపూర్, తాళ్లగూడెం, ఆర్కెపల్లి గ్రామశివారు భూములకు ఎలాంటి ప్రయోజనం లేదు. భీమారం వద్ద గల ప్రాజెక్ట్ డ్యాం నుంచి 25కిలోమీటర్ల పొడువు కాలువలు నిర్మించినా అందులో మండలంలోని 1000ఎకరాలకు కూడా సాగు అందడం లేదు. చాలా మంది రైతులు తమ పక్కనుంచే కాలువలు వెళ్తుండంతో మోటార్లు పెట్టి నీటిని పంట పొలాలకు తరలిస్తుంటారు. అయితే గత సంవత్సరం నుంచి ఇరిగేషన్ శాఖ అధికారులు కాలువలకు మోటార్లు పెట్టవద్దని హెచ్చరిస్తూ వాటిని తొలగించారు. దీంతో కాలువలు తమ పొలాలగుండా వెళ్తున్నా ప్రయోజనం లేకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జోడు వాగుల వద్ద ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేసి ఈ ప్రాంతంలో సాగు నీరు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

రైతుల మేలు కోసం కృషి చేయాలి



జోడు వాగుల వద్ద రెండు వాగులు కలిసే చోట వాగుపై చెక్ డ్యాం ఏర్పాటు చేయాలి. దీని వల్ల అంకూసాపూర్, తాళ్లగూడెం ప్రాంతాల్లోని భూములకు రెండు పంటలకు సాగు నీరు అంది, వ్యవసాయం అభివృద్ధి చెందుతుంది. ఈ విషయంలో ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– దుర్గం రాములు, రైతు అంకూసాపూర్


ఆకట్టుకుంటున్న పచ్చదనం..!



జన్నారం: మండలంలోని ధర్మారం నుంచి కలమడుగుకు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా హరితహారంలో నాటిన మొక్కలు విరివిగి పెరిగి వృక్షాలుగా మారాయి. రోడ్డుకు పచ్చని పందిరిలా వాహనదారులను ఆకట్టుకుంటున్నాయి. పచ్చదనంతో పాటు చల్లదనం పంచుతున్నాయి.

అనుచరులకు కలిసొచ్చిన ఎన్నికలు..!

- డబ్బు, మద్యం పంపిణీలో నాయకుల చేతివాటం



నెన్నెల: ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎలాగైనా గెలవాలనే ఉద్దేశంతో పట్టణాల్లో, గ్రామాల్లో కింది స్థాయి నాయకులకు, సర్పంచ్‌లకు, మాజీ సర్పంచ్‌లకు, కౌన్సిలర్లకు డబ్బు, మద్యం ఇచ్చి ఓటర్లకు అందేలా చూడాలని అభ్యర్థులు ఆదేశించారు. ఇదే అవకాశంగా భావించిన కింది స్థాయి నాయకులు కొంతమంది ఓటర్లకు అంతంత మాత్రంగానే పంపిణీ చేసి మిగిలిన దానిని దాచిపెట్టుకున్నారు. కొందరు తమకు దగ్గరగా ఉండే కార్యకర్తలకు మాట చెబితే వినే వారికి, వెంట తిరిగే వారికి కొంత అందజేశారు. మధ్యవర్తులకు ఇచ్చి డబ్బు, మద్యాన్ని తమ సొంత ప్రయోజనాలకు ఉపయోగించుకున్నారు. అభ్యర్థులు కొంతమంది ఇలాంటి వారిని గుర్తించి ముందే దూరం పెట్టారు. డబ్బులను చూసే సరికి నమ్మిన నాయకుల బుద్ధి మారిపోయింది. ఎన్నికల్లో ఇలాంటి వారి పంట పండింది. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్య పోటీ గట్టిగా ఉండటంతో ఇరు పార్టీల అభ్యర్థులు కోట్ల రూపాయలను పట్టణాలతో పాటు మండలాలకు తరలించి రాత్రి వేళల్లో పంపిణీ చేశారు. ఎన్నికలు ముగిసిన తర్వాత కూడా కొంత మంది కార్యకర్తలు ఇళ్లలో నుంచి మద్యం బాటిళ్లను తెచ్చి కొందరిని తృప్తి పరిచారు. ముందుచూపు ఉన్న ద్వితీయ శ్రేణి నాయకులంతా మద్యంతో పాటు నగదును కూడా వెనకేసుకున్నారు. గ్రామాల్లో వార్డు స్థాయిలో పంచే బాధ్యతలు చేపట్టిన కొందరు తమకు రోజువారీ అవసరాలకు ఉపయోగపడుతుందని నెల, రెండు నెలల వరకు సరిపడా బాటిళ్లను పంచకుండా ఇళ్లలో దాచుకున్నారు. వాహనాలకు పెట్రోల్, డీజిల్ పోయడంలో సభలు, సమావేశాలు ఏర్పాటులోనూ చేతివాటం ప్రదర్శించి కింది స్థాయి నాయకులు వెనకేసుకున్నారు. ఒక్కొక్కరు రూ.లక్ష నుంచి రూ.2లక్షల వరకు వెనుకేసుకున్నట్లు సమాచారం. సర్పంచ్‌ల రిజర్వేషన్ తమకు అనుకూలిస్తుందని భావించినా కొందరు డబ్బు, మద్యంను నిల్వ చేసుకున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎన్నికలు ఏమో గానీ, కొంత డబ్బు, మద్యం మిగిలిందని నాయకులు సంతోషపడుతున్నారు.